క్లుప్తంగా

హమాలీ కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక



వేలేరు : ఏఐటీయూసీ అనుబంధ హమాలీ కార్మిక సంఘం మండల కమిటీని ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రామ్మూర్తి, శనిగరపు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కీర్తి కొమురయ్య, ఉపాధ్యక్షుడిగా మాలోతు శంకర్, కార్యదర్శులుగా పుట్ట రాజు, రాజ్‌కుమార్, కోశాధికారిగా నాగరాజును ఎన్నుకున్నారు. హమాలీ కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేవని, హమాలీలకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు దాటిన కార్మికులకు రూ.3000లు పింఛన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండంలోని వివిధ గ్రామాల హమాలీలు పాల్గొన్నారు.

స్నేహితుల ఔదార్యం



శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన అరూరి ప్రశాంత్ తండ్రి ఎల్లాస్వామి ఇటీవల మృతి చెందాడు. ప్రశాంత్‌తో 2009–10 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న స్నేహితులు బాధిత కటుంబాన్ని పరామర్శించి రూ.13వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రశాంత్ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

శ్యామ్‌ప్రసాద్‌కు నివాళి



వేలేరు : జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కాట్రేవుల రాజు మాట్లాడుతూ.. శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ ఆశయాలను బీజేపీ ప్రభుత్వం కొనసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాలోతు రాజు, కిరణ్, శ్రీనివాస్, నరేష్, రాజు, కిరణ్, ప్రశాంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలి



దామెర : పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయ నిర్మాణం కోసం గ్రామంలో ఆదివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గడ్డం సదానందం, మేరుగు కుమార్, సార ఐలయ్య, డి. రాజు, పిడుగు సంపత్, పెంట రాజు, గోనెల వెంకటేశ్, అమ్ముల ఐలుకొమురు విరాళాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు తాటికొండ భద్రయ్య, భిక్షపతి, అశోక్, రమణాచారి, కృష్ణమూర్తి, రవికుమార్, శ్యామ్, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామంలో ఆదివారం బొడ్రాయి 10వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించారు. కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీతో కలిసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎండీ.అంకూస్, ఇప్ప శ్రీకాంత్, సుంచు అశోక్, గుంటి కుమారస్వామి, పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆగస్టు 26న శివశక్తి వినాయక ప్రతిష్ఠాపన

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్ రోడ్డు పెట్రోల్ బంక్ జంక్షన్‌లోని శివశక్తి వినాయక మందిరం ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ప్రతినిధి చెన్నూరి దేవేందర్, నల్లకుంట రవికుమార్, అచ్చ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో 38వ డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన ఉమ నేతృత్వంలో ఆగస్టు 26నుంచి 28వ తేదీ వరకు శ్రీగణపతి శివలింగ, నందీశ్వర సహిత పార్వతీదేవి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు.

ప్రమాదకరంగా బావులు..



కన్నూరు-కమలాపూర్ మార్గంలో ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావి



గూడూరు-వంగపల్లి బైపాస్ మార్గంలో ప్రమాదకరంగా వ్యవసాయ బావి

కమలాపూర్ : మండలంలోని వివిధ మార్గాల్లో రోడ్ల సమీపంలో ఉన్న వ్యవసాయ బావులు ప్రమాకరంగా మారాయి. హుజూరాబాద్–పరకాల మార్గంలో కమలాపూర్ నుంచి ఉప్పల్‌కు వెళ్లే రహదారి పక్కన ఉన్న వ్యవసాయ బావి, కమలాపూర్ నుంచి శనిగరం వెళ్లే మార్గంలో లక్ష్మీపూర్ వద్ద రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. తాటి వనం మీదుగా కమలాపూర్‌కు వచ్చే రహదారిలో కన్నూరు శివారులో గల రోడ్డు పక్కనే ఒకదాని పక్కనే మరోకటిగా ఉన్న వ్యవసాయ బావులు, గూడూరు నుంచి వంగపల్లి క్రాస్ రోడ్డు వద్దకు వెళ్లే బైపాస్ మార్గంలో, గూడూరు గ్రామ శివారులోని ఓ మలుపు వద్ద ఉన్న వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉన్నాయని తెలుపుతున్నారు. ప్రస్తుతం ఆయా బావుల చుట్టూ చెట్ల పొదలతో నిండుకున్నట్లు తెలిపారు. ప్రమాదాలు జరుగక ముందే సంబంధిత అధికారులు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు.

రుణమాఫీ నిర్ణయం చారిత్రాత్మకం



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

హన్మకొండ చౌరస్తా: ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ నిర్ణయం చారిత్రాత్మకమని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయల రైతు రుణాన్ని ఆరు విడతలుగా మాఫీ చేయగా, పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం రూ.11.930 వేల కోట్లు మాఫీ చేసి రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ, టీపీసీసీ కార్యదర్శి ఈవీ.శ్రీనివాసరావు, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు పోతుల శ్రీమన్నారాయణ, విజయశ్రీరజాలీ, నాయకులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటా

ఆటో కార్మికులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ పోలీస్ కమిషనరేట్ వద్ద గల కాకతీయ ఆటో యూనియన్ అడ్డా వద్ద బోర్డును ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. నగరంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ఆటోడ్రైవర్ల సేవలు కీలకమని ప్రశంసించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, కాకతీయ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ.అంకుషావలి, ఉపాధ్యక్షుడు ఎండీ.యాసిన్, ప్రధాన కార్యదర్శి ఎండీ.అక్రమ్, కార్యదర్శి మీర్జా, కోశాధికారి ఇక్బాల్, సహాయ కార్యదర్శి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేకల రవి

వరంగల్ /ఖిలా వరంగల్: సింగరేణి బొగ్గు గనుల వేలంపాటలను వెంటనే నిలిపివేయాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. వరంగల్‌లోని పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి బుస్సా రవీందర్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కార్మిక పోరాటలతోనే బుద్ధి చెప్పాలని సూచించారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను యావత్ కార్మికలోకం అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సింగరేణి బొగ్గు బ్లాకుల వేలాన్ని తక్షణమే ప్రభుత్వరంగ సంస్థలకు అప్పగించాలని సూచించారు. జిల్లాలో నూతన పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే.బష్మియ్, నాయకులు గుండె బద్రి, సంద్ర కుమార్, మెడిది అశోక్, పరికిరాల రమేష్, లావుడ్యా దసురు, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి వలబోజు వెంకన్న, మల్లారెడ్డి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాస్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట: పెరిగిన ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు విమర్శించారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం ఎల్లేశ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న జిల్లా వ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. పెరిగిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు సామాన్యులకు మోయలేని భారంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. టమాటా, ఉల్లి తదితర నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటాయని వాపోయారు. సమావేశంలో నాయకులు భిక్షపతి, శ్రీనివాస్, రాములు, ఓదెలు, సంతోష్, సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెలికి తీయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రం

కేయూ క్యాంపస్: జర్నలిజం విద్యార్థులు మీడియా యూనిట్‌తోపాటు స్పోకెన్ ఇంగ్లిష్ ల్యాబ్‌ను, అలాగే దూరవిద్యా కేంద్రంలోని లైబ్రరీని వినియోగించుకోవాలని కేయూ ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రాంచంద్రం సూచించారు. కేయూలోని దూరవిద్యా కేంద్రంలో రెగ్యులర్ జర్నలిజం విభాగం (2022 -2024) విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను జర్నలిస్టులు వెలికి తీయాలని సూచించారు. జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్ మాట్లాడుతూ జర్నలిజం విద్యార్థులకు సమాజంపట్ల నిశిత దృష్టి ఉంటుందన్నారు. ఇంగ్లిష్ కమ్యూనికేషన్ గల జర్నలిజం విద్యార్థులకు మీడియా సంస్థల్లో అనేక ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. సమావేశంలో జర్నలిజం విభాగం అధ్యాపకులు నర్సింహారాములు, డాక్టర్ శ్రీకాంత్‌యాదవ్, డాక్టర్ వంగాల సుధాకర్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, మోటె చిరంజీవి, విద్యార్థి సంఘాల నాయకులు సురేష్, మానస, శివకృష్ణ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై నాయకుల హర్షం



రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

కాజీపేట రూరల్: రూ.2 లక్షల రైతు రుణమాఫీపై కాంగ్రెస్ నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చిత్రపటాలకు రైతులు, కాంగ్రెస్ నాయకులు కాజీపేట 47వ డివిజన్ బోడగుట్టలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షుడు దొంగల కుమార్‌యాదవ్ తెలంగాణ రైతాంగానికి ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో రైతులు జి.సదానందం, ఎడ్ల ఎల్లస్వామి, బొల్లం రాజు, మొగిలి, నాయకులు ఇప్ప శ్రీకాంత్, షేక్ అజ్గర్, మైసారపు సిరిల్‌లారెన్స్, మహ్మద్ బిలాల్, కొమురవెల్లి రమేష్, భూషపాక శ్రీనివాస్, మహ్మద్ అలీమ్, బండారి రాజేందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 24న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. రామన్నపేట, బీట్ బజార్, హంటర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8.30గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. భీమారంలోని రాధిక ఆస్పత్రి, రామాలయం, సదానంద కాలనీ, అంబా కాంప్లెక్ష్, దుర్గా కాలనీ, సంతోషిమాత ఆలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు భీమారం చర్చి, గ్రామపంచాయతీ, మసీదు, బొడ్రాయి, సత్యసాయికాలనీ, రుద్రమ్మదేవీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు.

రేపు శ్వేతార్కుడికి తేనెతో అభిషేకం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం సంకటహర చతుర్థి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఆలయానికి అప్పగించే 108 లీటర్ల తేనెతో స్వామివారికి అభిషేకం చేయనున్నట్లు వివరించారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

హన్మకొండ కల్చరల్: హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 36వ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ అర్చకుడు అనంత శేషరాజన్ ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వస్తి వాచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధం, రుత్విగ్వరణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, తదితర పూజలు చేశారు.

ఎన్నిక

హసన్‌పర్తి: అఖిల భారత పారంపర్య వైద్య మహాసంఘం జాతీయ సంయుక్త కార్యదర్శిగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన చింతగట్టు గోశాల వ్యవస్థాపక అధ్యక్షుడు సర్జన రమేష్ ఎన్నికయ్యారు. ఏపీలోని తిరుపతిలో ఈ ఎన్నికలు జరిగాయి.

వెంకటాద్రినగర్ అభివృద్ధి కమిటీ ఎన్నిక

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వెంకటాద్రినగర్ కాలనీ అభివృద్ధి కమిటీని కాలనీవాసులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కార్పొరేటర్ ఎలకంటి రాములు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడిగా షఫ్రిక్, జాయింట్ అధ్యక్షుడిగా రాంనారాయణ సింగ్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.రఫీ, సంయుక్త కార్యదర్శిగా ఎండీ.హలీం, కోశాధికారిగా కరుణాకర్ రెడ్డి ఎన్నికయ్యారు.

జర్నలిస్టు నాయకులకు సన్మానం

వరంగల్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) తెలంగాణ రాష్ట్ర కమిటీలో ఉపాధ్యక్షుడిగా గాడిపెల్లి మధు, ఈసీ మెంబర్లుగా పెండెం వేణుమాధవ్, కంకణాల సంతోష్ చోటు సంపాదించారు. ఈమేరకు వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని ఉబేద్‌బాబా ఇంటి ప్రాంగణంలో ఓ ఉర్దూ ప్రతిక సీనియర్ జర్నలిస్టు ఇస్మాయిల్ జబీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారిని సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్‌బాబా హాజరై గాడిపెల్లి మధు, వేణుమాధవ్, సంతోష్, వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య అభినందించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఈసీ మెంబర్ సంగోజు రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, పెరుమాండ్ల మధు, సాజిద్, ఎండీ.అమీర్, హుస్సేన్ పాషా, అమీర్, అక్రం, కలికోట శ్రీధర్, నయీం పాల్గొన్నారు.

వేదజ్యోతిష్య సమ్మేళనానికి హాజరు



హన్మకొండ కల్చరల్: ఇంటర్నేషనల్ వేదిక్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ వేద జ్యోతిష్య సమ్మేళనంలో వరంగల్ జిల్లా ఓసిటీ ప్రాంతానికి చెందిన వాస్తు జ్యోతిష్య పండితుడు శ్రీరామోజు వీరబ్రహ్మాచార్యులు పాల్గొన్నారు. న్యూఢిల్లీలో ఇంటర్నేషనల్ హోటల్ రాడిసన్ బ్లూలో యూఎస్, ఇండియా చార్టర్లు సంయుక్తంగా అంతర్జాతీయ వేదజ్యోతిష్య సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించాయి. దేశ, విదేశాల నుంచే పలువురు హాజరైన సదస్సులో తెలంగాణ ప్రాంతం నుంచి ఐదుగురు వాస్తుజ్యోతిష్య పండితులు హాజరయ్యారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఎర్రయ్య

వేలేరు : రాష్ట్ర ప్రభుత్వం పేదలకిచ్చిన హామీలను నెరవేర్చాలని గ్రామీణ పేదల సంఘం అధ్యక్షుడు కామ్రేడ్ పడిగ ఎర్రయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కన్నారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తమ పబ్బం గడుపుకునేందుకు వివిధ పథకాలు అమలు చేస్తామని హామీలు ఇచ్చారని, గెలిచిన తర్వాత వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. దశాబ్దాలుగా ఇంటి స్థలాల సమస్య పరిష్కారం కాకుండ ఉందని, ఇందిరమ్మ ఇళ్లు, పక్కా ఇళ్లు, డబుల్ బెడ్రూం హామీలను మర్చిపోయారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామీణ పేదల సంఘం చేస్తున్న భూ పోరాటాలు, ఇళ్ల స్థలాలు, ఉద్యమ విస్తరణ, భవిష్యత్ పై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి, సహాయ కార్యదర్శి ముత్తయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాందాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరభద్రం, వీరేశం, వీరస్వామి పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



యోగా ఆసనాలు చేస్తున్న బ్రహ్మకుమారీలు

పరకాల: యోగ చేయడం వలన మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీ విశ్వవిద్యాలయం పరకాల శాఖ నిర్వహకురాలు బీకే విజయ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పరకాల బ్రహ్మకుమారీ కేంద్రంలో నిర్వహించారు. బ్రహ్మకుమారీ చైతన్య యోగా ఆసనాలు నేర్పించగా యోగా ప్రాముఖ్యతను బీకే విజయ వివరించారు. పురాతనకాలం నుంచి భారతదేశంలో యోగాకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. బ్రహ్మకుమారీలు సాంబమూర్తి, బీకే సంతోష్ బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



దామెర : పాలాభిషేకం చేస్తున్న నాయకులు



పరకాలలో..

దామెర : ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా నాయకుడు జక్కుల రవీందర్ అన్నారు. రైతు రుణమాఫీ ప్రకటించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన మాట తప్పకుండ రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేయడం సంతోషకరమన్నారు. మాజీ సర్పంచ్ మల్లాడి రాజిరెడ్డి, గ్రామ అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు రామకృష్ణారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పసరగొండలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ శనిగరం కళాసుధాకర్, భిక్షపతి, అమ్మ రమేశ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : తెలంగాణ రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్న సందర్భంగా మండలంలోని అక్కంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చిత్రపటానికి అక్కంపేట కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ముద్దం కృష్ణంరాజు పాలాభిషేకం చేశారు. మాజీ వైస్ ఎంపీపీ సాంబయ్య, మాజీ సర్పంచ్ విజయ హంషాల్‌రెడ్డి, ఎంపీటీసీ ఇందిర రాజిరెడ్డి, ఆత్మకూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిలువేరు భిక్షపతి, మాజీ సర్పంచ్ మాదాసి కుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాసరి భద్రారెడ్డి, ఓదెల రాంబాబు, రేగుల రాజేశ్, పెద్దబోయిన రవి, సిలువేరు ప్రసంగి, సిలువేరు రాజు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : రైతులకు రూ. 2లక్షల రుణమాఫీకి కేబినెట్ ఆమోదం తెలుపడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ప్రపంచరెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిందం రవి, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, చింతల రవిపాల్, మారేపల్లి రవీందర్, దుబాసి కృష్ణమూర్తి, వలిహైదర్, కట్టయ్య, రాజు, కుమారస్వామి, వీరన్న, రాజేందర్, సదయ్య పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల ఋణ మాఫీ చేసినందుకు మండలంలోని లక్ష్మీపురం గ్రామస్తులు, రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఆదివారం సంబురాల చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పుట్ట రాజు, గ్రామ ఉపసర్పంచ్ ఆముదాలపల్లి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో గ్రామ కూడలిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆముదాలపల్లి మల్లేశం, ఎంపీటీసీ పల్లెబోయిన సునీత, పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని అభ్యుదయ (వివేకవర్ధిని) పాఠశాలలో చదువుకున్న 2008–09 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు గూడూరు గ్రామ శివారులోని రిసార్ట్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకొన్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా 15 ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకుని తమ చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపి భోజనాలు చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రూప్ ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా పలువురు పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ.. 15 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. వివిధ హోదాల్లో స్థిరపడిన స్నేహితులు అందరూ తమ మంచి చెడులను పంచుకున్నారు. గురువులు నేర్పిన విద్యతోనే తాము ఈ స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. గురువుల రుణం తీర్చుకోలేదని అన్నారు. అనంతరం పాటలు పాడి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో వివేకవర్ధిని పాఠశాల కరస్పాండెంట్ పబ్బు సతీష్, హెచ్‌ఎం పిల్లల రాజు, ఉపాధ్యాయులు మొగిలిచెర్ల ప్రశాంత్, మౌటం శ్రీనివాస్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.